# సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 28 । మే । 2024




**బెట్టింగ్ మాయాజాలం**
గద్వాల జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం హాట్‌టాపిక్ మారింది.
వివరాలు 8లో ▸



**పత్తి విత్తనాల పట్టివేత**
కోస్గి మండలం సర్జఖాన్‌పేటలో భారీగా నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.6 /22.6

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### పద్మ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ క్రీడలు:** కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారి నుంచి పద్మ పురస్కారాల కోసం దరఖాస్తులను (నామినేషన్‌లు) ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ట్, సోషల్ వర్క్, సైన్స్ ఇంజనీరింగ్, ట్రేడ్, ఇండస్ట్రీస్, లిటరేచర్, ఎడ్యుకేషన్, స్పోర్ట్స్, మెడిసిన్, సివిల్ సర్వీసెస్ తదితర అంశాల్లో సాధించిన లక్ష్యాలు, చేసిన కృషిని రెండు పేజీలకు 800 పదాలకు మించకుండా పేర్కొంటూ నిర్ణీత ఫార్మాట్‌లో వచ్చేనెల 3వ తేదీలోగా జిల్లాకేంద్రం మెయిన్ స్టేడియం జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో హార్డ్‌కాపీ, సాఫ్ట్‌కాపీలను ఇవ్వాలని కోరారు. మిగతా వివరాల కోసం https://padmaawards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

### రామలింగేశ్వరస్వామి ఆలయ భూముల వేలం

**అడ్డాకుల:** కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద వచ్చే నెల 3న దేవాలయం భూములకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రాజేశ్వర శర్మ తెలిపారు. సర్వే నంబర్ 933, 935, 936, 937లలో ఉన్న 6 ఎకరాల 30 గుంటల భూమి, సర్వే నంబర్ 212, 213, 214, 215లలో ఉన్న 6 ఎకరాల 24 గుంటల భూమిని ఒక పంట నిమిత్తం కౌలుకు ఇవ్వడానికి వేలం వేయనున్నామని పేర్కొన్నారు. జూన్ 3 నుంచి డిసెంబర్ 31 వరకు ఒక పంట మాత్రమే సాగు చేయాలని నిబంధన ఉన్నట్లు చెప్పారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.20 వేల నగదును చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

### విధుల్లో నిర్లక్ష్యం.. ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

**నారాయణపేట రూరల్:** జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని బీవండీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శకమిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనుల విషయంలో నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళ్తే.. బీవండీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 20మంది విద్యార్థులు సైతం లేకున్నా.. ఇద్దరు టీచర్లు ఫర్హీన్‌బాను, జ్యోతి విధులు నిర్వహించేవారు. సీనియర్ అయినప్పటికీ ఫర్హీన్‌బాను హెచ్‌ఎం బాధ్యతలు తీసుకోకుండా తనకు ఉన్న పలుకుబడితో జూనియర్ అయిన జ్యోతికి ఆ బాధ్యతలు ఇప్పించారు. ఆ తర్వాత వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో తక్కువ పిల్లలు ఉన్నారనే కారణం చూయిస్తూ ఫర్హీన్‌బాను మరికల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లింది. కొద్దికాలం తర్వాత హెచ్‌ఎం జ్యోతి అనారోగ్యంతో మెడికల్ లీవ్ పెట్టినా.. ఫర్హీన్‌భాను తన సొంత పాఠశాలకు రాకుండా.. డీఈఓ ఫోన్ చేసి చెప్పినా మరికల్‌లోనే విధులు కొనసాగించింది. అనంతరం సైతం నీవు సీనియర్ అంటే.. నీవే హెచ్‌ఎం కదా అంటూ పనులు ఒకరిమీద మరొకరు వేసుకుంటూ కాలం వెళ్లదీస్తూ వచ్చారు. ఇదిలాఉండగా, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలకు చెందిన కమిటీ ఏర్పాటు చేయకపోగా అకౌంట్ ఓపెన్ చేయడంలోను నిర్లక్ష్యం వ్యవహరించారు. ఒకరిపై మరొకరు తోచివేసుకుంటూ గ్రాండ్స్ సైతం డ్రా చేయలేకపోయారు. దీనిపై ఎంఈఓ ఫిర్యాదు మేరకు కలెక్టర్ శ్రీహర్ష అనుమతితో డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని ఇరువురిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

### 31న మెగా జాబ్ మేళా

**పెబ్బేరు రూరల్:** హైదరాబాద్ రాణిగంజ్‌లోని గుజరాతి ఉన్నత పాఠశాలలో ఈ నెల 31న పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకి ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్) మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ గద్దె భాస్కర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగే మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు ఇతర పేరొందిన 25 సంస్థలు పాల్గొంటాయని.. వివిధ రకాల ఉద్యోగాలకు 2 వేల మందిని నియమించుకోనున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ తదితర ఉన్నత చదువులు చదివిన 18 నుంచి 30 ఏళ్లలోపు యువత అర్హులని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95424 33427, పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో సంప్రదించాలని సూచించారు.

# న్యాయ పోరాటం..!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ఆ గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన మైనింగ్ అనుమతులు.. కాలుష్య కారక పరిశ్రమ ఏర్పాటు ఆ పల్లెల్లోని ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించారు. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధమైన ఓటింగ్‌కు ఆ రెండు గ్రామాల ఓటర్లందరూ దూరంగా ఉండడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయినా పాలక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో న్యాయ పోరాటం కొనసాగుతుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం పాల్గొనేది లేదంటూ తేల్చి చెబుతున్నారు. అంతేకాదు వివిధ ప్రజా సంఘాలు, మేధావి వర్గాల మద్దతు కూడగట్టి.. ఉద్యమం ఉధృతం చేసేలా పోరుబాట కార్యాచరణకు సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు.

**మైలారం, ఎదిర వాసుల పోరు బాట**

- గుట్టపై మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని ఒకరు..
- కాలుష్య కారక బ్యాటరీ పరిశ్రమ వద్దని మరొకరు..
- ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణ
- పట్టించుకోని 'అధికార' యంత్రాంగంపై ఆగ్రహం
- స్థానిక సంస్థల ఎన్నికలనూ బహిష్కరించాలని యోచన
- నిరసనలతో పాటు వరుస ఆందోళనలకు కార్యాచరణ




అమరరాజా ఫ్యాక్టరీ ఆవరణలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎదిర గ్రామస్తులు (ఫైల్)

### ఎదిర: బ్యాటరీ పరిశ్రమ వద్దే వద్దు..

మహబూబ్‌నగర్ శివారులోని దివిటిపల్లి వద్ద గత ప్రభుత్వం ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు దివిటిపల్లి, ఎదిర, అంబటిపల్లి, సిద్దాయిపల్లి గ్రామాల్లోని రైతుల నుంచి దాదాపు 380 ఎకరాల భూసేకరణ చేపట్టింది. ఇందులో అత్యధికంగా ఎదిర గ్రామ రైతులే ఉన్నారు. ఐటీ పరిశ్రమలు వస్తే తమ పిల్లల జీవితాలు బాగుపడతాయని భావించిన రైతులు తమ భూములు అప్పగించారు. తీరా పాలకులు అమరరాజ బ్యాటరీ పరిశ్రమను ఇక్కడ నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టారు. ఆ పరిశ్రమకు దాదాపు 260 ఎకరాల స్థలం కేటాయించారు. ప్రజాభిప్రాయ సేకరణ సైతం జరగగా.. ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకించారు. ఆ తర్వాత క్రమంలో సదరు కంపెనీ భవన నిర్మాణ పనులను ప్రారంభించింది. ఈ క్రమంలో ఎదిర గ్రామస్తులు ఆందోళన బాటపట్టారు. కాలుష్యం వెదజల్లే ఈ పరిశ్రమతో తమ పంట పొలాలు నాశనం అవుతాయని, అనారోగ్యం బారిన పడతామంటూ సుమారు 70 రోజులుగా నిరాహార దీక్షలు చేపట్టారు. 'అధికార' యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ఇటీవల పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించిన వారు.. ఈ పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని.. లేకుంటే భవిష్యత్‌లో జరిగే ఏ ఎన్నికల్లోనూ ఓటు వేసేది లేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహంతో ఉన్న వారు వరుస ఆందోళనలకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### మైలారం: గుట్ట ముద్దు.. మైనింగ్ వద్దు

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామానికి ఆనుకుని గుట్ట ఉంది. ఈ గ్రామం మొత్తం ఆ గుట్టను అనుసరించే ఉంది. ఈ ఊరిలో 300 వరకు కుటుంబాలు ఉండగా.. 1,500 వరకు జనాభా ఉన్నట్లు అంచనా. గుట్టపైనే 50కి పైగా నివాస గృహాలతో పాటు నర్సింహస్వామి, వెంకటేశ్వర స్వామి, శివాలయం, మారెమ్మ, పోచమ్మ, ఈదమ్మ ఆలయాలు ఉన్నాయి. నల్లమల అడవీ ప్రాంతానికి సమీపంలో ఈ గ్రామం ఉండడంతో గుట్టపై నెమళ్లతో పాటు ఇతర వన్యప్రాణులు సంచరిస్తూ ఉన్నాయి. ఈ గుట్టపై విలువైన క్వార్జ్, ఫాల్స్‌పర్ రాళ్లు ఉండగా.. మైనింగ్ వ్యాపారులు, ఇతర పెద్దలు ఆరేళ్ల క్రితం కన్నేశారు. గుట్టపై సర్వే నంబర్ 120/1లో 98 ఎకరాలకు ఖనిజ తవ్వకాలకు మైనింగ్ శాఖ 2017లో అనుమతి ఇచ్చింది. 2022 వరకు స్తబ్దుగా ఉన్న కాంట్రాక్టర్ తవ్వకాల క్రమంలో గతేడాది సర్వే చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు మూకుమ్మడిగా వ్యతిరేకించడంతో తవ్వకాలు నిలిపివేశారు. ఆ తర్వాత ఆర్టీఐ ద్వారా గ్రామసభ తీర్మానం కాపీ వెలుగుచూడగా.. పలువురి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు.. 2041 అక్టోబర్ పదోతేదీ వరకు తవ్వకాలు చేసుకునేందుకు మైనింగ్‌శాఖ అనుమతులు ఇచ్చినట్లు తేలడంతో గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు.



నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామ వ్యూ

### 'ఉమామహేశ్వర' పరిస్థితి ఏమిటో..

మరోవైపు రూ.4,500 కోట్లతో తలపెట్టిన ఉమామహేశ్వర రిజర్వాయర్‌ను ఈ గుట్టను ఆనుకుని నిర్మించాలని నిర్ణయించారు. ఇలాంటి చోట మైనింగ్ చేపడితే రిజర్వాయర్ నిర్మాణాలకు నష్టం వాటిల్లదా.. అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గుట్టకు ఆనుకునే గ్రామం ఉన్నా.. ఎన్‌ఓసీ తదితర అనుమతులు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం కాదా? అని మైలారం వాసులు ప్రశ్నిస్తున్నారు. బల్మూర్, మైలారం, కొండనాగుల, వీరంరాజ్‌పల్లి, రామాజిపల్లి గ్రామాల ప్రజలకు గుట్ట ఆదెరువుగా ఉందని.. గ్రామ చెరువులో మత్స్యసంపదపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని.. ఎట్టి పరిస్థితుల్లోనూ గుట్టపై తవ్వకాలు జరగనివ్వమని గ్రామస్తులు భీష్మించుకు కూర్చున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే కలెక్టర్‌తో పాటు, స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను సైతం కలిసి మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరారు. ఫలితం లేకపోవడంతో గుట్ట ముద్దు.. ఓటు వద్దు అనే నినాదంతో పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించారు. గుట్టపై మైనింగ్ అనుమతులు రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగుతుందని.. ఇదే పరిస్థితి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలనూ బహిష్కరిస్తామని.. మైలారం గ్రామ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రోజువారీగా పోరు కార్యాచరణకు రంగం సిద్ధం చేసుకున్నట్లు గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

> **పోరు కార్యాచరణ రూపొందిస్తున్నాం..**
>
> 
>
> మైలారం గుట్టపై మైనింగ్ అనుమతులను వెనక్కి తీసుకోవాలి. ఇప్పటికే జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. పార్లమెంట్ ఎన్నికలకూ దూరంగా ఉన్నాం. ఇక ఆందోళనలు ఉధృతం చేస్తాం. రోజువారీగా పోరు బాట పట్టేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నాం. ఎమ్మెల్యే, మంత్రి, కలెక్టర్ క్యాంప్ కార్యాలయాలను ముట్టడించడంతో పాటు ప్రతి రోజు ఏదో ఒక రూపంలో నిరసన తెలిపేలా ముందుకు సాగుతున్నాం. మా సమస్యను పరిష్కరించే వరకూ ఊరుకునేది లేదు. – సుంకరి రాములు గౌడ్, మైలారం, నాగర్‌కర్నూల్

> **అమరరాజా కంపెనీని ఆపేయాల్సిందే**
>
> 
>
> **మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో ఏర్పాటు చేస్తున్న అమరరాజా బ్యాటరీ కంపెనీ (లిథియం అయాన్ గిగా) ని ఆపేయాల్సిందే. కాలుష్యం వెదజల్లే ఈ ఫ్యాక్టరీ వల్ల పరిసర గ్రామాలైన ఎదిర, దివిటిపల్లి, అంబట్‌పల్లి, సిద్దాయపల్లి వాసులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఈ కంపెనీని వేరే ప్రాంతానికి తరలించే వరకు మా పోరాటం ఆగదు. ఇందులో భాగంగా ఈనెల 13న ఎంపీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించాం. ఈ విషయమై 72 రోజులుగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడం తగదు. అవసరమైతే ర్యాలీగా బయలుదేరి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం. చివరగా హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మా బాధలను విన్నవించేందుకు పాదయాత్ర చేపడతాం. – శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, అమరరాజా బ్యాటరీ వ్యతిరేక పోరాట కమిటీ, ఎదిర

## పనుల పరిశీలన

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక మౌలాలి గుట్ట వద్ద ఏర్పాటు చేయబోయే డంపింగ్ యార్డు స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలోని మహాత్మాగాంధీ రోడ్ హైస్కూల్, కోనాపాలమూరు పాఠశాలలలో చేపడుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం వన్‌టౌన్‌చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న ట్రాఫిక్ సిగ్నల్స్ సైతం పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈ వైష్ణవి, ఆర్‌ఐ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



మౌలాలిగుట్ట డంపింగ్ యార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

## పెట్రోల్ బంకుల తనిఖీ

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లాకేంద్రంలోని వివిధ పెట్రోల్ బంకులను సోమవారం జిల్లా తూనికలు, కొలతల అధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకులు ప్రతిరోజూ సరిగా పని చేస్తున్నాయా? లేదా? అనే విషయాన్ని యజమానులు నిర్ధారించుకోవాలని సూచించారు. ఏటా విధిగా తనిఖీ ధ్రువపత్రం తీసుకోవాలన్నారు. వినియోగదారులు కోరిన మేరకు ఐదు లీటర్ల క్యాన్‌తో పెట్రోల్, డీజిల్‌ను చెక్ చేసి చూపించాల్సి ఉంటుందన్నారు. నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ బంక్‌కు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే తమ కార్యాలయాన్ని వినియోగదారులు నేరుగా సంప్రదించవచ్చని లేదా వాట్సప్ ద్వారా ఫోన్ నంబరు 9010651783కి ఫిర్యాదు చేయవచ్చన్నారు.



పద్మావతీకాలనీలోని ఓ బంక్‌లో పెట్రోలును కొలుస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

## నేడు 'సురవరం' గ్రంథావిష్కరణ

**స్టేషన్ మహబూబ్‌నగర్:** తొలి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం 'బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి' గ్రంథావిష్కరణ చేయనున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రం మెట్టుగడ్డలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథి గా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గ్రంథ సంపాదకులు, తెలంగాణ బాషా సాంస్కృతిక మండలి అధ్యక్షులు డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



**చిన్నచింతకుంట:** బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని నారాయణపేట పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుందర్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డి బీడీ, వస్తాద్ బీడీ ఫ్యాక్టరీలను సందర్శించి కార్మికుల సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికుల పీఎఫ్ సమస్యలు ఎన్నో ఉన్నాయన్నారు. అవి ఇప్పుడే మా దృష్టికి వచ్చాయని తెలిపారు. త్వరలోనే నిధి ఆప్కే నికట్‌లో పీఎఫ్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లు నరేష్, సాయులు, బీడీ కార్మిక సంఘం నాయకులు కోళ్ల వెంకటన్న, దేవదానం, అరుణ్‌కుమార్, చంద్రన్న ఉన్నారు.

## 'దేశానికి కావాల్సింది మానవత్వమే'



మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు ఆర్.రాంరెడ్డి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** దేశానికి కావాల్సింది మానవత్వమే తప్పా మతతత్వం కాదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మతమే ప్రధాన ఎజెండాగా ముందుకు రావడం తగదన్నారు. మైనారిటీ వర్గాలను ద్వితీయ పౌరులుగా ఉండాలని స్వయాన ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. అభివృద్ధిపై కాకుండా అబద్ధాలపైనే చర్చ జరిగేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులు, అభ్యుదయవాదులు ప్రచారం చేపట్టాలన్నారు. అంతకుముందు సీపీఎం సీనియర్ నాయకుడు ఆర్.రాంరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం విశృంఖలంగా పాలకవర్గాలే పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. దీనికి ప్రత్యామ్నాయ భావజాల రంగంలో విస్తృత పోరాటం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్, నాయకులు కిల్లె గోపాల్, ఎ.రాములు, నల్లవెల్లి కురుమూర్తి, వి.పద్మ, చంద్రకాంత్, రాజ్‌కుమార్, వేణు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విధులు జాగ్రత్తగా నిర్వహించాలి



ఎన్నికల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

- జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్
- కౌంటింగ్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** కౌంటింగ్ సిబ్బంది విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో సమయపాలన పాటించాలన్నారు. ఈ కేంద్రాల్లో వచ్చే నెల 4న అనధికార వ్యక్తులను అనుమతించబోమని, ప్రతి ఒక్కరూ ఐడెంటిటీ కార్డు ధరించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది అందరూ హాల్ వద్దకు సకాలంలో చేరుకోవాలన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు మాట్లాడుతూ సిబ్బంది ఈవీఎం కౌంటింగ్ పద్ధతులను తప్పకుండా అనుసరించాలన్నారు. ఒక్కో కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో టేబుల్‌కు సూక్ష్మ పరిశీలకుడు, సూపర్‌వైజర్‌తో పాటు ఇద్దరు సహాయకులను నియమించామన్నారు. ఈ శిక్షణలో 83 మంది సూపర్‌వైజర్లు, 98 మంది సహాయకులు, 75 మంది సూక్ష్మ పరిశీలకులు, 12 మంది ట్యాబులేషన్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ భాస్కర్, శిక్షణ నోడల్ అధికారి డా.శ్రీధర్‌సుమన్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- కలెక్టర్ రవినాయక్ ఆదేశం

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం అర్బన్ ప్రాంతాల్లో యూనిఫాం కటింగ్, స్టిచ్చింగ్ పని వేగవంతం చేయాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పాఠశాలల ప్రారంభంలోగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

## సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించాలి: ఎస్పీ



బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

**మహబూబ్‌నగర్ క్రైం:** పోలీస్ పరిధిలో వచ్చే సమస్యలపై దృష్టి పెడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించి, బాధితులకు సత్వరమే న్యాయం చేయడానికి పోలీసులు బాధ్యతతో పని చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ పిటిషన్లను స్వీకరించి మాట్లాడారు. ఒక్కో బాధితుడి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ ఆ తర్వాత సదరు పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు పోలీస్‌శాఖ ఎప్పుడూ కూడా అండగా ఉంటుందని, ప్రజలతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు.

## ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** స్ఫూర్తి సామాజిక సేవ యువజన కళా సంస్థ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని స్వరలహరి కల్చరల్ అకాడమీ కార్యాలయంలో సోమవారం చిత్రలేఖన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, ప్రముఖ కవి లక్ష్మణ్‌గౌడ్, అకాడమీ సభ్యులు డీకే ఆంజనేయులు, డాక్టర్ మేకల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళలను అభ్యసించడం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందన్నారు. స్ఫూర్తి సంస్థ సభ్యులు మాట్లాడుతూ చిన్నారుల్లో చిత్రలేఖనంలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 1 నుంచి 4 తరగతి విభాగంలో బి.ప్రణవ్ తేజ, ఎం.అద్విత్, హన్సిక, 5 నుంచి 7వ తరగతిలో ఈ.చైతన్య, హర్షవర్ధన్, అక్షయ, 8 నుంచి 10 వరకు సీహెచ్.శివకుమార్, శశివర్ధన్, అయేషా ఫిర్దోస్, ఇంటర్ నుంచి డిగ్రీ విద్యార్థుల విభాగంలో కీర్తన, శ్రీజ, వర్షారెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా వీరికి బహుమతులు అందజేశారు. కూచిపూడి నృత్య శిక్షకురాలు శాంతి సుధాకర్‌ను జ్ఞాపికతో సన్మానం చేశారు. స్ఫూర్తి సంస్థ సభ్యులు జేపీ మహేష్‌కుమార్, బోలయాదయ్య, సి.నరేష్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన చైతన్యకు బహుమతి అందజేస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్ తదితరులు

## సోనామసూరి ధర రూ.2,459

**దేవరకద్ర:** దేవరకద్ర మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,459, కనిష్టంగా రూ.2,069గా పలికాయి. ధాన్యం సీజన్ తగ్గడంతో మార్కెట్‌కు దాదాపు వంద బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

# బెట్టింగ్ మాయాజాలం

## నడిగడ్డలో అసలు బుకీలపై దాగుడుమూతలు

- అధికారులకు తలనొప్పి తెప్పిస్తున్న విచారణ
- త్వరలోనే అరెస్టు చేస్తామంటూ ఎస్పీ ప్రకటన



గద్వాల క్రైం: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై పందెంరాయుళ్లు ఆన్‌లైన్ లింక్‌లు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నడిగడ్డలో యథేచ్ఛగా సాగింది. అడ్మిన్ పంపే లింక్‌లతో బెట్టింగ్ ఆడే కేటుగాళ్లు తమ సామర్థ్యానికి మించి మ్యాచ్‌లపై పందెం కాస్తుంటారు. ఈ వ్యవహారాన్ని టాస్క్‌ఫోర్స్ బృందాలు గుర్తించి ఈ నెల 20న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి గద్వాల జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ హాట్ టాపిక్ మారింది. అదుపులోకి తీసుకున్న నలుగురు వ్యక్తులను వివిధ కోణాల్లో సీఐ స్థాయి అధికారి ఆరా తీస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రారంభం నుంచి బెట్టింగ్ నిర్వహణకు ఎలాంటి యాప్‌ల ద్వారా వాట్సాప్ గ్రూప్‌లకు లింకులు పంపుతున్నారు.. ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు.. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ఇతరత్రా వాటి ద్వారా మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారా.. ఆస్తులు కుదవ పెట్టుకుని అప్పులు ఇచ్చారా.. ఇలా అనేక అంశాలను నిర్వాహకుల నుంచి కూపీ లాగే పనిలో పోలీస్ అధికారుల తీరు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనకు అన్నట్లుగా మారింది. ఈ క్రమంలోనే పట్టుబడిన వ్యక్తుల నుంచి విభిన్నమైన ఆరోపణలు వస్తున్నాయి. అదుపులోకి తీసుకుంటే తమను ఎందుకు రిమాండ్‌కు పంపడం లేదని స్వరం పెంచుతున్నట్లు తెలిసింది. బెట్టింగ్ వ్యవహారంలో నాయకులు సిఫార్సులు సైతం పోలీసు విచారణ అధికారులకు తలనొప్పిగా మారింది.

**బలమైన వ్యక్తులు వెలుగులోకి..**

బెట్టింగ్ నిర్వాహకులను టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులతో బెంబేలెత్తించాయి. అయితే ప్రధాన బెట్టింగ్ నిర్వాహకులు ఏపీ, మహారాష్ట్ర, ఢిల్లీ, బెంగుళూర్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, ఐపీఎల్ నిర్వహణ సంస్థలైన యజమానులతోపాటు వ్యవస్థలను తారుమారు చేసే బలమైన వ్యక్తులు ఈ వ్యవహారంలో ఉన్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంపై జిల్లా పోలీస్ శాఖ దాగుడుమూతలు ఆడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు బెట్టింగ్ మాఫియా గ్రామీణ స్థాయికి చేరిందంటే ఈ వ్యవహారం ఎంత బలంగా పునాదులు వేసుకుంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. ఈ బెట్టింగ్‌లో పట్టుబడిన వ్యక్తులపై నమోదవుతున్న కేసులో తెలంగాణ గేమింగ్ యాక్ట్ ఉండడం నిర్వాహకులకు ఊరట కలిగించడంతోపాటు కఠినమైన శిక్షలు లేకపోవడం కూడా ఓ కారణం కావొచ్చనే దీమా వారిలో కనిపిస్తోంది. వ్యక్తిగత పూచీకత్తుపై బయటకు వస్తామనే ఆశ పందెంరాయుళ్లు బరితెగించేందుకు ఉసిగొల్పుతోంది. రూ.లక్షల్లో పందెం కాస్తూ.. రూ.కోట్లు సంపాదించవచ్చనే లక్ష్యంతో బెట్టింగ్ జోరుగా సాగుతుంది.

### పాము చావొద్దు..

పందెంరాయుళ్లను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ స్థాయిలో ఉన్నతాధికారులు, నాయకులు, ప్రముఖులు ఒత్తిళ్లు తేవడం విచారణాధికారులకు తలనొప్పిగా మారింది. పాము చావొద్దు.. కట్టె విరగొద్దు అన్న చందంగా విచారణ చేపట్టాలని వారికి సూచనప్రాయంగా చెబుతున్నట్లు తెలుస్తుంది.

### ఉపేక్షించేది లేదు..



జిల్లాలో గుట్టుగా నడుస్తున్న క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై కట్టుదిట్టమైన ప్రణాళికలు ఉన్నాయి. విచారణలో ప్రముఖులు ఉన్నట్లు వెల్లడైంది. వారిని సైతం త్వరలో అరెస్టు చేస్తాం. నలుగురుతోపాటు మరి కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిని విచారిస్తున్నాం. బ్యాంకు ఖాతాలు, ఇతరత్రా లావాదేవీలపై కూపీ లాగుతున్నాం. పట్టుబడిన వారికి 41 సీఆర్‌పీసీ నోటీసులు అందించాం. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశాం. బెట్టింగ్ ఆడిన వారు ఎవరున్నా సహించేది లేదు. తమ శాఖలో ఉన్నవారిని సైతం ఉపేక్షించేది లేదు. పూర్తి వివరాలను ప్రజలకు మీడియా ద్వారా తెలియజేస్తాం. ఎలాంటి విమర్శలకు తావు లేదు.

– రితిరాజ్, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

# నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- ఓ రైతు ఇంట్లో నిల్వ ఉంచిన వ్యాపారి
- పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్న అధికారులు
- వాటి విలువ రూ.16.77 లక్షలు
- కేసు నమోదు చేసిన వికారాబాద్ జిల్లా అధికారులు



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలతో అధికారులు

కోస్గి: వ్యాపారులు తమ లాభాపేక్ష కోసం రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు చూస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రైతుల ఇళ్లలో నకిలీ విత్తనాలు నిల్వచేసి విక్రయాలు చేపడుతున్నారు. పక్కా సమాచారంతో వికారాబాద్ జిల్లా పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడి చేయగా.. పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. దీంతో అధికారులు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గ్రామస్తులు, పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం ఇడుపులపాడుకి చెందిన వేణుబాబు కొన్ని సంవత్సరాలుగా కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేటలో నివాసం ఉంటూ.. పత్తి విత్తనాలు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన హన్మయ్యతో కలిసి నకిలీ పత్తివిత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మూడు రోజుల కిందట వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అధికారుల సమగ్ర దర్యాప్తులో వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌లో రైతు ఆశప్ప వద్ద పెద్ద మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఇంట్లో నిల్వ ఉంచి నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నారనే పక్కా సమాచారంతో కొడంగల్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రైతు ఇంట్లో నిల్వ ఉంచిన 20 బస్తాల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలపై విచారణ చేపట్టగా.. కోస్గి మండలం సర్జఖాన్‌పేటకి చెందిన వేణుబాబు, హన్మయ్య వ్యాపారులు తన వద్ద రూం అద్దెకు తీసుకొని విత్తనాలు నిల్వ చేసినట్లు సదరు రైతు చెప్పడంతో అధికారులు సదరు వ్యాపారులపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన నకిలీ విత్తనాల విలువ రూ.16.77 లక్షలు ఉంటుందని తెలిపారు.

### నకిలీలకు అడ్డాగా మారిన కోస్గి మండలం..

వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడుల్లో మండలంలోని సర్జఖాన్‌పేట వ్యాపారుల నకిలీ వ్యాపారం బయటపడటం, అధికారులు తీగ లాగితే డొంక కదిలి పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు పట్టుబడటంతో కోస్గి మండలం నకిలీలకు అడ్డాగా మారిందనే వాదనలు జోరందుకున్నాయి. గతంలో సైతం నెల్లూరు జిల్లాకు చెందిన కొండప్ప నాయుడు కోస్గిలో నివాసం ఉంటూ.. భారీగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తూ పట్టుబడ్డాడు. పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు కావడంతో వికారాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేసి పరిగి సబ్ జైలుకు తరలించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అప్పటి ఎస్పీ చేతన ఆదేశాల మేరకు జైలులో ఉన్నప్పటికీ సదరు వ్యాపారిపై పీడీ యాక్టు అమలు చేసి పరిగి సబ్‌జైలు నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. తాజాగా మరోమారు ఆంధ్ర వ్యాపారి కోస్గి మండలాన్ని అడ్డాగా చేసుకొని నకిలీ వ్యాపారాన్ని విస్తరించి పట్టుబడటం సర్వత్ర చర్చనీయాంశమైంది.

## దేశాయిపల్లి వాసికి ఐకాన్ గోల్డెన్ నంది పురస్కారం



మహమ్మదాబాద్: మండలంలోని దేశాయిపల్లికి చెందిన బురగంజి రాములుకు ఐకాన్ గోల్డెన్ నంది అవార్డు లభించింది. కళారంగంలో సేవలందిస్తున్నందుకుగాను హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో మెగా ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సింగర్ ప్రతాప్, శిరీషరెడ్డి, టీవీ యాంకర్స్ మధుబాబు, ముంతాజ్, స్వామి తదితరులు అవార్డు అందజేసి సత్కరించారు. అవార్డు అందజేయడం సంతోషంగా ఉందని గ్రహీత రాములు పేర్కొన్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రాములు సుమారు 20 ఏళ్లుగా తిరుపతి, గుంటూరు, విజయనగరం, కర్నూలు , పొద్దుటూరు, కడప, ఖమ్మం, హైదరాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన నాటక ప్రదర్శనల్లో పాల్గొని కృష్ణుడు, అర్జునుడు, నారదుడు, యయాతి, సత్యకీర్తి, సత్యశీలుడు తదితర పాత్రలు పోషించారు.



ఇండోర్ స్టేడియం గోడలపై ఆకట్టుకుంటున్న నిఖత్ జరీన్, సచిన్, పీవీ సింధు చిత్రాలు

# చిత్రం.. భళా

- ఇండోర్ స్టేడియంలో ఆకట్టుకుంటున్న బొమ్మలు
- క్రీడాకారుల చిత్రాలతో స్టేడియానికి కొత్త శోభ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నిలుస్తోంది. హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియాలకు ధీటుగా పాలమూరులో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని తీర్చిదిద్దారు. ఈ స్టేడియంలో ఆరు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటుచేశారు.

**ఆకట్టుకుంటున్న చిత్రాలు..**

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం బయట గోడలపై వేసిన క్రీడాకారుల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఔత్సాహిక క్రీడాకారులకు అవగాహన కలిగేలా ఆయా క్రీడల్లో రాణిస్తున్న ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు ఇండోర్ స్టేడియానికి కొత్త శోభను తెచ్చిపెట్టాయి. జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ ఆర్టిస్ట్ మధు క్రీడాకారుల చిత్రాలు గీశారు. స్టేడియం ప్రధాన ద్వారం గోడపై ఓవైపు ప్రముఖ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధూ, మరోవైపు బాక్సర్ నిఖత్ జరీన్, మధ్యలో ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, స్టేడియానికి మరోవైపు క్రికెటర్లు విరాట్ కొహ్లి, సిరాజ్, షటిల్ క్రీడాకారిణి గుత్తాజ్వాల, మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, జావెలిన్‌త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా, కబడ్డీ క్రీడాకారుడు రాహుల్ చౌదరితో పాటు ఇతర క్రీడాకారుల చిత్రాలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

### అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా ఉంది..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల చిత్రాలు గీయడానికి అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా ఉంది. గతంలో జిల్లా కేంద్రంలోని స్టేడియం ప్రహరీపై 36 గంటల్లోనే 300 లకుపైగా క్రీడలకు సంబంధించిన చిత్రాలను గీశాను. అదే విధంగా వాలీబాల్ అకాడమీలో క్రీడల బొమ్మలను వేశాను. – మధు, ఆర్టిస్ట్, మహబూబ్‌నగర్



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంపై ఆకట్టుకుంటున్న క్రీడాకారుల చిత్రాలు

## ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. బాలుడి మృతి

ఉప్పునుంతల: ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను దాటబోయి ట్రాలీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు దుర్మరణం పాలవగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా.. జడ్చర్ల మండలం అక్కల బండతండాకు చెందిన ఓ కుటుంబం కారులో శ్రీశైలం వెళ్లి సోమవారం రాత్రి జడ్చర్లకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మండలంలోని ఫిరట్వానిపల్లి స్టేజీ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను దాటబోయి ట్రాలీకి వెనుక వైపు కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ముందు సీట్లో కూర్చొని ఉన్న బాలుడు చైతన్య(16) అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం గాయపడిన వారితోపాటు బాలుడి మృతదేహాన్ని అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

# ట్రాక్టర్ బోల్తా: మహిళ దుర్మరణం



బోల్తా పడిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న గ్రామస్తులు

- ముగ్గురికి గాయాలు

మహమ్మదాబాద్: ట్రాక్టర్ బోల్తాపడి ఓ మహిళ మృతిచెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. వేపూర్‌కు చెందిన గొల్ల అంజిలమ్మ (55) తల్లి గారి ఊరు మంగంపేట. తన ఇద్దరి కుమార్తెలను మంగంపేటలోని అన్న కుమారుడు, తమ్ముడి కుమారుడికి ఇచ్చి వివాహం చేసింది. వేపూరులో బొడ్రాయి పండుగ ఉండటంతో సోమవారం ఉదయం కుమార్తె యాదమ్మతో పాటు ఇద్దరు మనుమరాండ్లు కృష్ణవేణి, నాగమణిని తీసుకొని బయలుదేరింది. వేపూరు వెళ్లడానికి మొకర్లాబాద్‌లో బస్సెక్కేందుకు కాలినడకన వెళ్తుండగా దేశాయిపల్లికి చెందిన గొల్ల శ్రీనివాస్ బోరు మరమ్మతులు చేసే ట్రాక్టర్ రావడంతో ఆపి ఎక్కారు. కాస్త దూరం వెళ్లగానే ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తాపడగా పైపులు పైకెత్తే టవర్ అంజిలమ్మ తలపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. యాదమ్మ కాలు విరగగా.. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అంజిలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

## యువతి అదృశ్యం: కేసు నమోదు



మనీష(ఫైల్)

కొత్తకోట రూరల్: యువతి అదృశ్యమైన ఘటన సోమవారం మండలంలోని నిర్వేన్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మనీష(20) ఇంటర్ చదివి ఇంట్లోనే ఉంటోంది. ఎవరికి చెప్పకుండా యువతి బయటకు వెళ్లింది. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో యువతి తల్లి పద్మ గ్రామానికి చెందిన యువకుడు పొనగంటి శివపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

**మరో ఘటనలో..**



ఉమా సత్యసాయికృష్ణ

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రానికి చెందిన తాతయ్య నాయుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు ఆటబాల ఉమాసత్యసాయికృష్ణ(23) ఈనెల 23న పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించకలేదు. సోమవారం యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

# బాధిత కుటుంబాలకు ఆదుకుంటాం



జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ క్రైం/తెలకపల్లి/తాడూరు/బిజినేపల్లి: తాడూరు మండలం ఇంద్రకల్ శివారులో కోళ్ల షెడ్ కూలీ మృత్యువాత పడ్డ పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన భార్యాభర్తలు రాముడు, చెన్నమ్మ మృతదేహాలను జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పరిశీలించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తానని తెలిపారు. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

**బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన**

మృతుల కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.లక్ష మంజూరు చేయడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తు కొద్దిసేపు జనరల్ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడే ఉన్న పోలీసులు నాయకులకు సర్దిచెప్పి ధర్నాను విరమింపజేశారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

తెలకపల్లికి చెందిన దండు లక్ష్మణ్(12) ఆదివారం పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఘటన పాఠకులకు విదితమే. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పలువురు నేతలు పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లు రవితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

**ఆర్డీఓ పరామర్శ**

తాడూరు మండల కేంద్రంలో గాలివానకు రేకుల షెడ్‌కూలి మృతిచెందిన మల్లేష్, కూతురు అనూష కుటుంబాలతో సోమవారం ఆర్డీఓ సురేష్ వివరాలను సేకరించారు. ప్రమాదం ఏవిధంగా జరిగింది. షెడ్ నిర్మాణంలో ఉన్నదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి భూమికి సంబంధించిన వివరాలు, ఆర్థిక వనరులు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల, డీటీ మహమ్మద్అలీ ఉన్నారు. కాగా కోనుంపు ప్రాంతంలో ఘటనకు సంబంధించిన షెడ్‌ను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లురవి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నలుగురి మృతి తనను కలిచివేసిందని మండల కేంద్రంలో గాలివాన బీభత్సం సృష్టించడం వల్ల మృతి చెందిన కుటుంబాలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.



తెలకపల్లిలో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

**ఆదుకుంటాం..**

బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. తిమ్మాజీపేట మండలంలోని మారేపల్లికి చెందిన వెంకటయ్య మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అదే గ్రామానికి చెందిన రైతు కర్ణాకర్‌రెడ్డి కూలిన కోళ్లఫారంను పరిశీలించారు. అదే గ్రామంలో ఇంటి పైకప్పులు లేచి పోయిన మరో ఇద్దరు బాధితుల ఇళ్లను ఇండ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం నుంచి తగిన ఆర్థికసాయం అందేలా చూస్తామన్నారు.

### కిక్కిరిసిన జనరల్ ఆసుపత్రి

ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో తాడూరు మండలంలోని ఇంద్రకల్ శివారులో కోళ్ల షెడ్ గోడకూలి ఆదివారం నలుగురు మృత్యువాతపడ్డారు. తెలకపల్లి మండలకేంద్రంలో మేకలు మేపేందుకు తండ్రికి సాయంగా వెళ్లిన బాలుడు పిడుగుపాటుకు గురై మృతిచెందడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను చూసేందుకు వచ్చిన కుటుంబసభ్యులు, నాయకులతో కిక్కిరిసిపోయింది. ఇంద్రకల్ శివారులో కోళ్ల షెడ్ గోడకూలి తాడూరుకు చెందిన మల్లేష్, అతని కుమార్తె అనూష, పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన భార్యభర్తలు రాముడు, చెన్నమ్మ మృతదేహాలను, తెలకపల్లికి చెందిన దండు లక్ష్మణ్ మృతదేహాలను నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, నియోజకర్గంలో ఈదురుగాలులతో కూడిన వర్షంతో ఆస్తినష్టం జరిగిందని, అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా రూ.11లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

## రైస్‌మిల్ సీజ్.. కేసు నమోదు



ఆత్మకూర్‌లో సీజ్‌చేసిన మిల్లు వద్ద అధికారులు

ఆత్మకూర్: పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం తీసుకుని తిరిగి చెల్లించక పోవడంతో ఆత్మకూర్‌లోని కొండకృష్ణయ్య రైస్‌మిల్లును సీజ్‌చేసి యజమానిపై క్రిమినల్ కేసును నమోదు చేసినట్లు సంస్థ ఏఈ బాలునాయక్ తెలిపారు. సోమవారం రైస్‌మిల్లును అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పౌర సరఫరాల సంస్థకు కొండ కృష్ణయ్య రూ.4 కోట్లు విలువచేసే 33,927 బస్తాల బియ్యంను అప్పగించకుండా జాప్యం చేస్తున్నాడని వివరించారు. జిల్లావ్యాప్తంగా 75 మంది రైస్‌మిల్లర్లు రూ. 375 కోట్ల విలువచేసే బియ్యం చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇప్పటికే పలు కేసులు నమోదుచేసి మిల్లులను సీజ్‌చేసినట్లు తెలిపారు. రెండేళ్ల కాలంలో నాలుగు సీజన్లలో బియ్యం చెల్లించకపోవడంతో కేసులను నమోదు చేశామన్నారు. శాఖ డీటీ నందకిషోర్, సహాయ అధికారి వేణు, ఆర్ఐవాసు సిబ్బంది ఉన్నారు.

## రామన్‌పాడులో 1,012 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,012 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల సమాంతర కాల్వ ద్వారా 27 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. ఎడమ కాలువ ద్వారా నీటి సరఫరా లేదు. తాగునీటి అవసరాలకు రోజు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.